# "పండుగనాడే మెతుకుల బువ్వ"

నేనప్పుడు కరీంనగరంల బియస్సి సదువుతన్న. దసుర సెలవులకనింటి కచ్చిన రోజు పొద్దుగాల్లేత్తెనే సెరువుదిక్కు పోవుడలవాటు నాకు. ఆ రోజు గూడ సెంబట్కపోయి, మొకం గడుక్కోని, పెయ్యి గడుక్కోనింటి కచ్చిన. కొంచెమంత పొద్దెక్కింది. చాదాగి మంచంల ఎల్లెలుకల పన్న.

"చాను దాగినవా బిడ్డ?" మా నాయిన్నడిగిండు.

"మా దాగన్నే" అన్న నేను పండుకొనే.

"చేదబాయి చాంతాడు బొత్తలకు తెగింది. బొక్కెన నూతిలపడేటట్టుంది. గా మాదిగ పేరనింటికి పొయ్యి ఓ సాంతాడు పేనుగరమ్మను. నాల్గు రోజులకిందనే సెప్పిన గనింక తేలే" అన్నడు.

"గిప్పుడే పోవన్నా? పగటిపోవన్నా?"

"పగటీలి వరకాడుండడు. ఇంకొద్ది సేపయితె బువ్వదినెల్లిపోతడు. గిప్పుడే పొయ్యి సెప్పిరా" పో.

"అయితె పోతన్న మరి" అని మంచాల్నుంచి లేసి అంగితొడుక్కున.

హరిజెనవాడకు పోయిన. పేరయ్యాకిట్ల కూసుండి తాడు పేనుతుండు. దగ్గెరికి పొయ్యి నిల్సున్న.

"పేరయ్యా! నాయిన్న జెప్పిన సాంతాడు తెమ్మన్నడు".

"గి పేనేతాడు మీ కోసురమే పటేల. నిన్న మొన్న తీరిపాడుగాలే. ఇది పేనుకొని పట్టుకత్త'

"పురాగ లేకుంటైంది. జెప్పన్దే. నేంబోతన్న" అని బయిలెల్ల వోయిన.

"ఏం జేత్తవు పొయ్యి?" గట్ల కూసోలేవు పటేల!" అని అక్కన్నే వాల్చున్న మంచం సూపెట్టిండు. ఆ నులుక మంచం పట్టెమీన కూసున్న.

నా సదువు గురించి, కన్నాగురంల వండుక తినుడు గురించి తీరుతీరు ప్రశినలేత్తంటె నేను జెవాబులు సెప్పుతన్న.

నా చూపులు మాత్రం నా మంచానికి కొంచెం దూరంలున్న పేరయ్య పెండ్లాం నర్సమ్మమీద

పడ్డయి. బొంతోలున్న మాసికలు పడ్డ నేసిన సీరె గట్టుకోనుందామె. ఆమె తొడుక్కున్న రైకె ఈపుల సినిగుంది. ఎన్నో దినాలవట్టి నెత్తికి నూనె లేనట్టు ఎంటికలన్ని సిందరవందర గున్నయి. అండ్ల కొన్ని తెల్లెంటుకలున్నయి. మొక మీద్సుకపొయ్యింది. కండ్లు పాతాల్లోకంలున్నయి. ఐదేండ్ల పొల్లగాని ముంగట కంచుతలె వెట్టి అండ్లున్న బువ్వను తినుబిడ్డ తిను అంటంది. ఆ తలె లోపలికి సూసిన. జేరుడోలున్న పాసిపెయిన మక్కగడెక, ఎల్లిపాయెలేసి నూరిన తొక్కున్నదండ్ల. ఆ తొక్కుతోని గడుక గలిపి ఎర్రంగున్న బువ్వను 'తిను బిడ్డ తిను' అంటంది నర్సమ్మ. ఓ బుక్క కొడుకు నోట్లె పెట్టవోయింది. కనా పిల్లగాడు ఆ బువ్వను నోట్లె పెట్టనీయలే. "బువ్వ మంచిగలేదు నేందిన పో '! అన్నడు ఐదేండ్ల సిలుకయ్య...

కమ్మగుంది గాదుబిడ్డ తిను" అని సిలుకయ్య నోరు తెరిపిచ్చి బుక్క పెట్టబోయింది.

"ఆసనత్తంది. నాగ్గీ సలిగడుకద్దు పో"

"ఆసన్లేదు. గీసన్లేదు కమ్మగుంది తిను" అని గద్దరిచ్చింది నర్సమ్మ.

నేను మాట్లాడుడాపి తేటే సూత్తన్న.

"నాకద్దంటే గీ బువ్వ? కక్కత్తంది" అని నోట్లె వెట్టిన బుక్కను ఊంచిండు.

"పోరనికి నావారేత్తు. దొరననుకుంటున్నావురా తిను గాడ్డి తిను ఉడుకు బువ్వింకిడుకలే. సాన సేపయితది" అని సెంపమీదోటేసింది. సిలుకయ్య ఏడుపందుకున్నడు.

"అగుబిడ్డాగు. ఏడ్సుడెందుకురా? మరి బువ్వెందుకు తింటలేవు? ఇగేం గొట్ట గని తిను' ' ఏడుత్తున్న సిలుకయ్య నూకుంచింది.

"నాత్తిరి దంబలుంటె పొయ్యలేవె. కలుపుకొని తాగుతడు" పేరయ్యనగానే నర్సమ్మ గుడిసె లోపలికి పొయ్యి ఓ కడుముంత తెచ్చి అండ్లున్న అంబల్ని తలెల పోసింది. జుయ్‌మని ఈగలు తలెసుట్టు ముసిర్నయి. చేతుల్తోని ఈగల్ని అటిటుతోలి గడుకంబలి కలిపింది నర్సమ్మ.

"ఇగనన్న తాగుబిడ్డ" అని తలెను సిలుకయ్య నోటికాడ నెట్టింది.

"పాసిపెయింది, ఆసనుంది నాకద్దు పో" అని తలెను దూరం దొబ్బిండు సిలుకయ్య.

"సెప్పుతె ఇనత్తలేదార పోడ తిను" అని ఎన్నులొక్కటేసింది.

"నేం దినపో. నాకు మెతుకుల బువ్వ గావాలె?" అంటూ కాళ్లను నాలెకేసి కొట్టుకుంట అటం బెడుతండా పిల్లగాడు.

"పోరడు పాడుగాను. మంచిగ జెప్పుతె ఇనెటట్టు లేడు. ఈనికి మెతుకులబువ్వ గావల్నట. ఈడేమన్న దొర కొడుకు ననుకుంటుండో? సాపెలుపు బూమన్న లేదని గీపోరనికి తెలువదా?" అనుకుంట సిలుకయ్యను వంగబెట్టి దబిల్లు దబిల్లున నాలుగు గుద్దింది.

సిలుకయ్య రాగందీసి ఏడ్సుడు మొదలు పెట్టిండు.

"ఏందేమొ పోరన్ని కొట్టవడితివి బాగ బలిసినావె" అనుకుంట పేరయ్య పనాపి నిల్సున్నడు.

"ఇగనాదో బలుపుగాదు. నువ్వు తెచ్చి పెడుతాంటె కూసుండి తింటె బలువకుంటె బక్కవడుతనా? ఇగ జూడు పెయ్యి పొంటకండ!" అని సేతులను ముంగటికి సాపి సూపెట్టింది. కట్టెపుల్లలోలున్న సేతులు తోల్తోనూగుతన్నయి. నేను లేసి నిలవడ్డ.

"సూడు పటేల సూడు. గీ పోరన్ని కొడితే మత్తదిగని పోరడేమొ సెప్పుతె ఇనకపాయె. ఇగ యాష్టకచ్చి కొడ్తి. కొట్టినంక పోరనేడ్సు జూత్తె పానమయిసిపోతది. గీనికి మెతుకుల బువ్వ గావన్నట. గది మా అసొంటోల్ల కెట్లదొరుకాలె? పొద్దుందాక, తెల్లందాక వన్జేత్తె ఐదేల్లు నోట్లెకచ్చుడే కట్టం గావట్టె. ఇగ మెతుకులేన్నుంచి తేవాలె సెప్పన్న" నన్ను జూసుకుంటది నర్సమ్మ.

నేనేం మాట్లాడలే.

సిలుకయ్యను బుదురకించి ఊకించిండు పీరయ్య.

"గాదుత్తలున్న నూకల్దెచ్చిపెట్టు ఆడు బువ్వ మాతింటడు" అన్నడు పెండ్లాంతో.

నూకల్దెచ్చి సిలుకయ్య అంగిలపోసింది. ఆన్ని సేతులల్లకు తీసుకుంది. గద్దువ పట్టుకుంది.

"గీ గడు కంబల్దాగినంక నూకలు బుక్కు కొడక. గిద్దాగితినాంటె అవ్వొడిసినంక ఇంకిన్ని వెడత. మనసొంటోల్లకు మెతుకుల బువ్వనిత్తె గావన్నంటేడ దొరకుతది బిడ్డ? మన రాతలు పాడురాతలు. మనమీద గా మీదోనికి దయుంటె గిట్లెందుకుంటం బిడ్డ? దొరికిందాతోని కడుపు నింపుకోవాలె గని ఏడుత్తే మత్తది సెప్పు బిడ్డ? గీంత గడుకగూడ దొరకుతలేదు కొందరికయితె? ఇంక నాలుగొద్దులయితె పండుగత్తంది. గా పండుగనాడు మెతుకుల బువ్వ, బొక్క కూరండి నేను కడుపునిండ తినిపిత్త బిడ్డే. ఇంకెన్ని రోజులేడియి? నాలుగే రోజులు. తెల్లారుతండె, పొద్దుగూకుతండె. ఎంతల గడిసిపోతయి?

సిలుకయ్యకా మాటలు సముజయితన్నయో లేదో కాని నర్సమ్మ బుదురకిత్తంది. పండుగనాడు మెతుకుల బువ్వనగానే సిలుకయ్య మొకం మీద ఎలుగు కనవడ్డది నాకు ఆ గడుకంబలి మెల్లెమెల్లెగ ఒక్కొక్క బుక్క తాగిపిచ్చింది నర్సమ్మ. గప్మని వాసనత్తన్న ఆ గడుకంబలి నా పొల్లగాడు తాగుతంటె సూత్తున్న నాకు కడుపుల దేవినట్టయింది.

సాన్నాడు జెప్పన్దే అని ఇంటికచ్చిన.

ఇప్పటికీ గా సంగతి యాదికత్తె నా మనుసంతెట్లనో ఐతది. పానమయిసిపోతది. గిప్పుడు కొన్ని మార్పులచ్చినా ఐనా సానమంది బతుకులు గట్లనే ఉండుడు నా కండ్లగ్గనవడ్తనే వున్నయి. గవ్వి మారితె బాగుండు. అందరికీ కనీసానికి కడుపునిండ బువ్వన్న దొరుకుతె మంచిగుండునని నా అండ్ల నేను రోజుకెన్నోమాట్ల అనుకుంట. అప్పుడప్పుడు నాకు తెలువకుంటనే నా కండ్లపొంటి నీల్లు గారుతయి.